# వీడనున్న ఉత్కంఠ

## నేడే ఎన్నికల కౌంటింగ్

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- హవేళీఘనపూర్‌లోని వైపీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ షురూ
- 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు
- మెదక్ నియోజకవర్గంలో 20 రౌండ్లు
- నర్సాపూర్ నియోజకవర్గంలో 22 రౌండ్లు
- వీడియో, సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్




హవేళీఘనపూర్‌లోని వైపీఆర్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు..

**మెదక్‌లో 20 రౌండ్లు.. నర్సాపూర్‌లో 22 రౌండ్లు..**

మెదక్ నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో 14 ఈవీఎంలు, ఒక టేబుల్‌ను పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం ఉపయోగిస్తారు. మెదక్‌లో 20 రౌండ్లలో లెక్కింపు పూర్తి అవుతుంది. నర్సాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు, 22 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం మెదక్‌లో 4 టేబుళ్లు, నర్సాపూర్‌లో 2 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

మెదక్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ హవేళీఘనపూర్‌లోని వైపీఆర్ కళాశాలలో ఆదివారం జరుగనున్నది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనున్నది. గత నెల 30న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ నిర్వహించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**8 గంటల నుంచే కౌంటింగ్ షురూ..**

జిల్లాలో రెండు నియోజకవర్గాల నుంచి ఎన్నికల బరిలో 24 మంది అభ్యర్థులు ఉన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభంకానున్నది. ఉదయం 5.30 గంటలకే కౌంటింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకోనున్నారు. పాసులు ఉన్న వారికే లోపలికి అనుమతిస్తారు. వైపీఆర్ కళాశాలలోని రెండో అంతస్తులో 14 టేబుళ్లు ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు సిబ్బందిని నియమించారు. మొదట పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూంను ఓపెన్ చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఇవి పూర్తయిన తర్వాత ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్లను నియమించారు. మొదటి రౌండ్ ఫలితం ఉదయం 9 గంటలకు విడుదలవుతుంది.

**అభ్యర్థుల్లో ఉత్కంఠ..**

పోలింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయి. ఎవరిని విజయం వరిస్తుందన్న అంశంపై పోటీ చేసిన అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. తమకున్న విజయావకాశాలను అంచనా వేస్తూ, పోలింగ్ సరళిని అంచనా వేస్తూ గెలుపు, ఓటములను విశ్లేషించుకుంటున్నారు. ఓటింగ్ తమకు సానుకూలంగా ఉన్నదని, మెదక్ జిల్లా ఓటర్లు మరోసారి అభివృద్ధి వైపు నిలుస్తారని బీఆర్ఎస్ అభ్యర్థులు భావిస్తున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన మెదక్ అభివృద్ధిని ప్రజలు ఆశీర్వదించారని అనుకుంటున్నారు. మెదక్ జిల్లా ప్రజలు అభివృద్ధి వైపు మొగ్గు చూపారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మెదక్‌లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మూడోసారి హ్యాట్రిక్ సాధిస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పోలింగ్ శాతాన్ని బట్టి మొత్తంగా బీఆర్ఎస్‌కు అనుకూల ఫలితాలు ఉండే అవకాశం ఉన్నదని, భారీ మెజార్టీ సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**కౌంటింగ్ వద్ద 144 సెక్షన్..**

కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. శుక్రవారం పోలింగ్ సరళి 17 ఏ రిజిస్టర్ పరిశీలనకు అన్ని పార్టీలు హాజరయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, ఆర్వోలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాసులు, పరిశీలకుల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. కౌంటింగ్ ప్రక్రియ వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల ద్వారా చిత్రీకరించనున్నారు. లెక్కింపు కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ ఉండేలా జనరేటర్లు, ఇన్వర్టర్లు అందుబాటులో ఉంచనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, గొడవలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన మూడంచెల భద్రతను సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. కౌంటింగ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంది.



వైపీఆర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు

# కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

*మెదక్ ఎస్పీ రోహిణిప్రియదర్శిని*

మెదక్ అర్బన్, డిసెంబర్ 2: హవేళీఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైపీఆర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఉన్నందున జిల్లాలోని ప్రజలు, ఎన్నికల సిబ్బంది, పార్టీ అభ్యర్థులు, ప్రధాన ఏజంట్లు పోలీసులకు సహకరించాలని మెదక్ ఎస్పీ రోహిణిప్రియదర్శిని కోరారు. శనివారం ఓ ప్రటనలో ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఈ సమయంలో ఐదుగురు కంటే ఎక్కువ వ్యక్తులు గుమిగూడొద్దని సూచించారు. మద్యం అమ్మకాలు, పటాకులు కాల్చడం నిషేధమని తెలిపారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు భద్రతా సిబ్బందికి చూపిస్తేనే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందని, మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, లైటర్ల వంటి వస్తువులు కౌంటింగ్ హాల్‌లోకి తీసుకెళ్లకూడదని పేర్కొన్నారు. గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలను 4వ తేదీన చేసుకోవాలని, నిర్వహణకు సంబంధిత పోలీస్ అధికారుల నుంచి రాతపూర్వకంగా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..**

హవేళీఘనపూర్ వైపీఆర్ కళాశాలలో అసెంబ్లీ కౌంటింగ్ ఉన్నందున ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ ముగిసేవరకు జనరల్ ట్రాఫిక్ సమస్య ప్రజలకు ఈరోడ్డు మార్గం నుంచి అనుమతించబడదన్నారు. వైపీఆర్ కళాశాల మార్గాల నుంచి ప్రవేశం లేదని హవేళీఘనపూర్ చౌరస్తా నుంచి తీన్ నంబర్ చౌరస్తా వరకు రోడ్డు మూసివేయబడుతుందని తెలిపారు. కౌంటింగ్ సంబంధించిన విధులు నిర్వహణ కోసం వచ్చే వాహనాదారులు తమకు కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలు నిలపాలని తెలిపారు.

# కట్టుదిట్టమైన భద్రతతో లెక్కింపు

- సీసీ కెమెరాలతో అనుక్షణం పర్యవేక్షణ
- సాయుధ బలగాల పహారా
- 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు
- కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలనలో మెదక్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): కట్టుదిట్టమైన భద్రతతో ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గట్టి భద్రత మధ్య ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని ఆయన వెల్లడించారు. మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలంలోని వైపీఆర్ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, 20 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, ఈవీఎం పోస్టల్‌తో దాదాపు 22 రౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా నియోజకవర్గాల నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రమైన వైపీఆర్ కళాశాలకు ఈవీఎంలు తరలించి జాగ్రత్తగా సరిచూసుకుని, స్ట్రాంగ్ రూంలలోకి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా క్రమపద్ధతిలో అమర్చామన్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్‌రూంలతోపాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి సోమవారం ఉదయం 6.00 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్లు రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లను నిశితంగా పరిశీలన చేశారు. ఆయనవెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్వో రాజేశ్వర్, ఎన్నికల అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా